# వేగుచుక్క

VC NEWS

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 20 జూలై 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 12

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




విశ్వ విజేతగా స్పెయిన్

# పార్లమెంట్ సమరం..
# నేటి నుంచే

## బిల్లుల వేడి, విపక్షాల వ్యూహాలతో రసవత్తరంగా సమావేశాలు!

దేశవ్యాప్తంగా రాజకీయ ఉత్కంఠ రేపుతున్న పార్లమెంట్ ప్రతిష్ఠాత్మక సమావేశాలు నేటి నుంచే ప్రారంభం కానున్నాయి. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన అత్యంత కీలకమైన బిల్లును అధికారిక ఎజెండాలో ఇంకా చేర్చకపోయినప్పటికీ, ఈ ప్రతిష్ఠాత్మక బిల్లుపై అవసరమైన సంఖ్యాబలాన్ని కూడగట్టేందుకు అధికార కూటమి అన్ని రకాలుగా పావులు కదుపుతోంది. మరోవైపు ఈ బిల్లును గట్టిగా తిప్పికొట్టాలని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సన్నద్ధమవుతోంది.

### మహిళా రిజర్వేషన్లపై అధికార కూటమి నజర్

### పేపర్ లీకేజీలు, అయోధ్య విరాళాల చోరీపై నిలదీసేందుకు విపక్షాల సిద్ధం


### అఖిలపక్ష భేటీ నుంచి విపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ, జులై 19: ఈ విడత సమావేశాల్లో విదేశీ విరాళాల నియంత్రణ చట్ట సవరణ బిల్లు, 'వికసిత భారత్ శిక్షా అధిష్ఠాన్' బిల్లు వంటి అనేక కీలక బిల్లులు ఉభయ సభల ముందుకు చర్చకు రానున్నాయి. సమావేశాలు ప్రారంభమవుతున్న తరుణంలోనే పార్లమెంట్‌లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోయాయి. 'ఇండియా' కూటమితో ఇప్పటికే తెగదెంపులు చేసుకున్న డీఎంకే, తమ పార్టీ సభ్యులకు సభలో విడిగా సీట్లు కేటాయించాలని కోరింది. మరోవైపు తృణమూల్ కాంగ్రెస్ నుంచి విడిపోయి, కొత్తగా ఏర్పాటైన 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా'లో చేరినట్లు ప్రకటించిన 20 మంది ఎంపీల విడిగా కూర్చునే అభ్యర్థనను లోక్‌సభ స్పీకర్ ఆమోదించారు.



అయితే, సాంకేతికంగా వారిని ఆ కొత్త పార్టీ భాగంగానే గుర్తించాలన్న వినతిపై స్పీకర్ నుంచి తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది.

ఇక వివిధ ప్రజాసమస్యలు, వివాదాస్పద అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు విపక్షాలు వ్యూహప్రతివ్యూహాలతో సిద్ధమయ్యాయి. దేశాన్ని కుదిపేసిన ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ప్రతిపక్షం తరువాయి 2 వ పేజీలో..





## నేడే పార్లమెంట్ మార్చ్

### విజయవంతం చేయాలని వాంగ్‌చుక్ పిలుపు

### భద్రతా కారణాల దృష్ట్యా అనుమతి నిరాకరించిన ఢిల్లీ పోలీసులు

### వాంగ్‌చుక్ తరలింపును సమర్థించిన హైకోర్టు

న్యూఢిల్లీ, జులై 19: ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా 21 రోజులుగా పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేసిన నేపథ్యంలో, ఆయన పిలుపు మేరకు 'పార్లమెంట్ మార్చ్' నిరసన ర్యాలీ సోమవారం జరగనుంది. తనను ఆస్పత్రిలో అక్రమంగా నిర్బంధించారని ఆక్షేపించిన వాంగ్‌చుక్.. నిర్భయమైన భారత్ సాకారం కోసం, అన్యాయం నుంచి విముక్తి తరువాయి 2 వ పేజీలో..



2

## 21న హకీంపేటలో రేవంత్ పర్యటన

### పారిశ్రామిక జోన్ పనులపై ప్రత్యేక సమీక్ష

### క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 21న తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ లో పర్యటించనున్నారు. దుద్యాల మండలం హకీంపేటలో సీఎం పర్యటన ఖరారు కావడంతో స్థానిక అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ పర్యటనకు సంబంధించి ఆదివారం ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి డీఈ సురేందర్, దుద్యాల తహసీల్దార్ తో పాటు కొడంగల్ సీఐ, ఎస్ఐ తదితర అధికారులు ముందస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



2

## ఇది రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు!

### కాళేశ్వరం నీళ్ల కోసం కదంతొక్కిన రైతులు

### రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

కాళేశ్వరం నీళ్ల కోసం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల రైతులు స్వచ్ఛందంగా కదంతొక్కారు. రంగనాయక సాగర్ నింపాలని డిమాండ్ చేస్తూ రైతులు పదిహేను కిలోమీటర్ల మేర మహా పాదయాత్ర నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు మొదలైన ఈ యాత్ర మధ్యాహ్నం మూడు గంటలకల్లా ముగిసింది.

## రాష్ట్రంలో 15వ ఆర్థిక సంఘం నిధులు దారిమళ్లాయి



### కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపణ

### చర్యలు చేపట్టాలని కేంద్రానికి లేఖ

హైదరాబాద్: రాష్ట్రంలో 15వ ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లాయని, విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కేంద్రాన్ని కోరారు. ఈమేరకు ఆదివారం ఆయన కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్‌కు బహిరంగ లేఖ రాశారు. "కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు.. తాగునీరు, పారిశుద్ధ్యం, ఘన-ద్రవ వ్యర్థాల నిర్వహణ, గ్రామ మౌలిక సదుపాయాలు, ప్రజా ఆస్తుల నిర్వహణ వంటి నిర్దేశిత పనులకే వినియోగించాల్సి ఉంటుంది. తెలంగాణలో ఈ నిధులను నిర్దేశిత లక్ష్యాలకు భిన్నంగా ఖర్చు చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. గ్రామాభివృద్ధి పనులకు వినియోగించకుండా సిబ్బంది జీతభత్యాలు, విద్యుత్ బిల్లులు, సాధారణ నిర్వహణ ఖర్చులు, ఇతర పరిపాలన అవసరాలకు మళ్లిస్తున్నట్లు గ్రామ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఈ విషయంలో మౌఖిక ఆదేశాలతో గ్రామ సర్పంచులపై ఒత్తిడి తెచ్చి ఈ నిధులను ఇతర ఖర్చులకు వినియోగించే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫలితంగా తాగునీటి పథకాలు, పారిశుద్ధ్య పనులు, అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. కేంద్ర ఆర్థికశాఖ ఈ ఏడాది ఇప్పటివరకు విడతలవారీగా రూ.2,293.74 కోట్లు రాష్ట్ర ఖజానాకు జమ చేసింది. మరో రూ.729.41 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేస్తున్న క్రమంలో తక్షణమే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలి"**





## సర్‌ను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్, భారాస, మజ్లిస్ కుట్రలు

హైదరాబాద్ : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ సహకారంతో మజ్లిస్ పార్టీ చాప కింద నీరులా దొంగ ఓట్లను నమోదు చేయించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దీని కోసం ఉద్యోగులను బెదిరిస్తూ తమకు అనుకూలంగా మలుచుకుంటోందని ధ్వజమెత్తారు. ఆదివారం భాజపా నగర కార్యాలయంలో పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఉదయం సెషన్‌కు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, మధ్యాహ్నం సెషన్‌కు కిషన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రేటర్‌లో నివసిస్తున్న ఇతర ప్రాంతాల వారు ఇక్కడే ఓటు నమోదు చేసుకోండి

"మజ్లిస్ కుట్రలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారు. ఈ కుట్రలకు భాగ్యనగర ప్రజలు అడ్డుకట్ట వేయాలి. ఇప్పటికే భాగ్యనగరంలో మజ్లిస్ పార్టీ ప్రాబల్యం పెరిగిపోయింది. రాష్ట్రంలో భవిష్యత్తులో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు మజ్లిస్ దీర్ఘకాల ప్రణాళికలను అమలుచేస్తోంది. దీని కోసం కాంగ్రెస్, భారాసలను వాడుకుంటోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రేటర్‌లో నివసిస్తున్న ఇతర ప్రాంతాల ప్రజలు హైదరాబాద్‌లోనే తమ ఓటును నమోదు చేసుకుని మజ్లిస్ పార్టీ నుంచి హైదరాబాద్‌ను రక్షించాలి. మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్, భారాసలు లెఫ్ట్ హ్యాండ్, రైట్ హ్యాండ్. జీహెచ్ఎంసీని ఆ పార్టీకి కట్టబెట్టేందుకు కాంగ్రెస్, భారాసలు పావులు కదుపుతున్నాయి" అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

**కేసీఆర్ గతంలో ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి మాట తప్పారు. గ్రూప్-1 లాంటి కీలక పరీక్షల పేపర్ల లీక్‌తో నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారు. విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, లెక్చరర్లు, ప్రభుత్వ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అంతకంటే దారుణంగానే వ్యవహరిస్తోంది. కానిస్టేబుల్ పోస్టులు మినహా మరే ఇతర పెద్ద నోటిఫికేషన్లు ఇవ్వలేదు"**

ప్రసంగిస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు

**'నిజమైన ఓటర్లకు హక్కులు కల్పించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియ పవిత్రమైన కార్యక్రమం. రాష్ట్రంలో కాంగ్రెస్, భారాస, మజ్లిస్ పార్టీలు దానిని నిర్వీర్యం చేసేందుకు కుట్రలకు పాల్పడుతున్నాయి'**

కాంగ్రెస్, భారాసలపై పోరాటాలకు సిద్ధంకండిప్రస్తుత కాంగ్రెస్, గత భారాసల పాలనపై పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు ఎన్.రామచందర్‌రావు పిలుపునిచ్చారు. "ఆ రెండు పార్టీలు ప్రజా సమస్యలను పూర్తిగా పక్కనబెట్టాయి. గతంలో భారాస చేసిన తప్పులనే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోంది.

## అవినీతిని..నిర్మూలిస్తే ఉచితాలు సాధ్యమే



**అవినీతిని నిర్మూలిస్తే.. ఇప్పుడున్న రాష్ట్ర బడ్జెట్‌తోనే వాటిని అమలు చేయవచ్చు. ఎల్‌నినో ప్రభావముంటుందని ఆర్నెల్ల కిందటే తెలిసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదు. రాష్ట్రంలో 57 రిజర్వాయర్లలో 418 టీఎంసీల నీరు నిల్వ చేసే అవకాశమున్నా పట్టించుకోలేదు. ప్రస్తుతం కేవలం 93 టీఎంసీలు మాత్రమే ఉండడంతో సాగు, తాగునీటికి కష్టాలు తప్పేలా లేవు. సాగునీరు, ఉద్యోగాల కల్పన విషయంలో భారాస, కాంగ్రెస్ నాయకులు ఒకరిపై ఒకరు ఎదురుదాడి చేసుకుంటున్నారు.. తప్పితే రెండు పార్టీలకు చిత్తశుద్ధి లేదు"**

కోరుట్ల:అవినీతిని..నిర్మూలిస్తే ప్రజలకు ఉచిత విద్య, వైద్యం వంటి పథకాలు అమలు చేయడం సాధ్యమేనని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలో నిర్వహించిన పాంచజన్య సంకల్పసభలో కవిత మాట్లాడుతూ.. "ప్రపంచ మేధావులతో మాట్లాడి పాంచజన్య పేరుతో ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం వంటి పథకాలతో ప్రజల ముందుకొచ్చాం. ఉచిత విద్య, వైద్యం సాధ్యం కాదని పలువురు నాయకులు విమర్శిస్తున్నారు.

# నేటి రాశి ఫలాలు

**మేషం :** పట్టుదలతో పనిచేసి అనుకున్నది సాధిస్తారు. కొన్ని పరిస్థితులు మనోవిచారాన్ని కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. హనుమాన్ చాలీసా పఠిస్తే మంచి ఫలితాలు కలుగుతాయి.

**వృషభం :** కీలక విషయాల్లో దిగ్విజయంగా ముందుకెళ్తారు. వృత్తి, వ్యాపార రంగాల్లో మీకు అనుకూలంగా కొన్ని నిర్ణయాలు మారతాయి. ఆనందించే సంఘటనలు చోటుచేసుకుంటాయి. ఇష్టదైవ స్తుతి మంచిది.

**మిథునం :** ఉద్యోగంలో కార్యసిద్ధి ఉంది. స్నేహపూర్వక వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యుల మాటలకు గౌరవం ఇస్తూ ముందుకెళ్లండి. శుభం జరుగుతుంది. ఆంజనేయ స్వామి సందర్శనం శుభప్రదం.

**కర్కాటకం :** చేపట్టే పనులకు ఆటంకం కలగకుండా చూసుకోవాలి. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. కొన్ని సంఘటనల్లో ఆటంకాలు ఎదురైనా అధైర్యపడకుండా ముందుకు సాగితే మేలైన ఫలితాలు లభిస్తాయి. దుర్గాస్తుతి శుభదాయకం.

**సింహం :** చేపట్టిన పనులలో పురోగతి ఉంటుంది. మానసికంగా దృఢంగా ఉంటారు. సంతృప్తికర ఫలితాలను రాబట్టడానికి ఇది సరైన సమయం. సౌభాగ్య సిద్ధి ఉంది. ఇష్టదేవత స్తోత్ర పఠనం శుభప్రదం.

**కన్య :** మీ మీ రంగాల్లో కార్యజయం ఉంది. కీర్తి వృద్ధి చెందుతుంది. బంధువుల ఆదరాభిమానాలుంటాయి. అర్థలాభం ఉంది. ఆంజనేయ స్వామి ఆరాధన శుభదాయకం.

**తుల :** తలపెట్టిన కార్యాల్లో విజయసిద్ధి ఉంది. ఒక శుభవార్త ఉత్సాహాన్నిస్తుంది. విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. తోటివారి సహాయ సహకారాలున్నాయి. దైవబలం రక్షిస్తోంది. శ్రీ వేంకటేశ్వర స్వామి సందర్శనం శుభప్రదం.


**వృశ్చికం :** మీ మీ రంగాల్లో సందర్భానుసారంగా ముందుకు సాగితే శుభఫలితాలు అందుకుంటారు. మీ పట్టుదలే మిమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. అనవసర విషయాల్లో తలదూర్చకండి. లక్ష్మీ ధ్యానం మంచినిస్తుంది.

**ధనుస్సు :** శ్రమకు తగిన ఫలితాలుంటాయి. ఉద్యోగంలో ఉన్నతాధికారులతో నమ్రతగా వ్యవహరించాలి. గిట్టనివారు మీ ఉత్సాహంపై నీళ్లు చల్లుతారు. మనోవిచారం కలిగించే ఘటనలకు దూరంగా ఉండాలి. సూర్య స్తుతి మేలుచేస్తుంది.

**మకరం :** ప్రశాంతమైన ఆలోచనలతో గొప్పవారవుతారు. సమర్థతను పెంచాలి. కీలక విషయాల్లో బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలి. శుభఫలితాలు పొందడానికి వేంకటేశ్వర స్వామిని సందర్శించాలి.

**కుంభం :** లక్ష్యాలకు కట్టుబడి పనిచేయాలి. ధర్మ సందేహాలతో కాలా న్ని వృథా చేయకండి. కుటుంబ సభ్యులతో ఆచితూచి వ్యవహ రించాలి. మనోవిచారం కలగకుండా చూసుకోవాలి. ప్రయా ణంలో ఆటంకాలు కలుగుతాయి. శివారాధన శుభప్రదం.

**మీనం :** చేపట్టే పనుల్లో విజయం సాధిస్తారు. కొన్ని సందర్భాల్లో లౌక్యంగా వ్యవహరించి సమస్యలను అధిగమిస్తారు. భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగండి. గణపతి ఆరాధన శుభప్రదం.



# పార్లమెంట్ సమరం నేటి నుంచే

**మొదటి పేజీ తరువాయి**

గట్టిగా పట్టుబట్టనుంది. అలాగే, అయోధ్యలో విరాళాల చోరీ అంశంపై పార్లమెంటును స్తంభింపజేస్తామని సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటికే ప్రకటించడంతో సభలో తీవ్ర దుమారం రేగడం ఖాయంగా కనిపిస్తోంది. వీటితో పాటు పెట్రోలులో ఇథనాల్ కలపడం, దేశ విదేశాంగ విధానం వంటి కీలక అంశాలు కూడా ఈ విడత సమావేశాలను ఉడికించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఆదివారం న్యూఢిల్లీలో నిర్వహించిన సాంప్రదాయ అఖిలపక్ష సమావేశం తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, జేఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్, శివసేన (యూబీటీ), ఆమ్‌ఆద్మీ, మరియు వామపక్ష పార్టీలకు చెందిన ప్రతిపక్ష నేతలు సభ నుండి వాకౌట్ చేశారు.

తృణమూల్ కాంగ్రెస్ నుంచి విడిపోయిన 20 మంది తిరుగుబాటు ఎంపీలను ఈ సమావేశానికి ఆహ్వానించడంపై విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ఈ విలీనానికి స్పీకర్ ఇంకా అధికారిక ఆమోదం తెలపలేదని, టేబుల్ ఆఫీస్ రికార్డుల ప్రకారం తమ బలం 28 మందిగానే ఉందని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా స్పష్టం చేయగా, రాజ్యాంగ రక్షణ కోసమే తాము వాకౌట్ చేశామని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ పేర్కొన్నారు. మరోవైపు, పార్లమెంట్ సమావేశాలను సజావుగా నడిపేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కేంద్రం విజ్ఞప్తి చేసింది. ఈ భేటీలో కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జేపీ నడ్డా, అర్జున్ రామ్ మేఘవాల్‌లతో పాటు తెలుగు రాష్ట్రాల ప్రతినిధులుగా లావు శ్రీకృష్ణదేవరాయలు (టీడీపీ), బాలశౌరి (జనసేన), మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి (వైసీపీ), వద్దిరాజు రవిచంద్ర (బీఆర్‌ఎస్) తదితరులు పాల్గొన్నారు.

# ఇది రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు!

**కాళేశ్వరం నీళ్ల కోసం కదంతొక్కిన రైతులు**

**సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు రైతుల పాదయాత్ర**

**పగ, ప్రతీకారంతోనే దిగువకు వృథాగా 70 టీఎంసీలు**

**సీఎం రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్**

సిద్దిపేట, జూలై 19: కాళేశ్వరం నీళ్ల కోసం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల రైతులు స్వచ్ఛందంగా కదంతొక్కారు. రంగనాయక సాగర్ నింపాలని డిమాండ్ చేస్తూ రైతులు పదిహేను కిలోమీటర్ల మేర మహా పాదయాత్ర నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు మొదలైన ఈ యాత్ర మధ్యాహ్నం మూడు గంటలకల్లా ముగిసింది. ఇది బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన యాత్ర కాదని, కేవలం చిన్నకోడూరు రైతులు కరువు నుంచి కాపాడుకునేందుకు స్వచ్ఛందంగా చేపట్టిన కార్యక్రమమని, వారి ఆహ్వానం మేరకే తాను హాజరయ్యానని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇప్పుడున్న కరువు ప్రకృతి తెచ్చింది కాదని, అది కాంగ్రెస్ మరియు రేవంత్ రెడ్డి తెచ్చిన కరువేనని ఆయన విమర్శించారు. కేసీఆర్ కు ఎక్కడ మంచి పేరు వస్తుందో అన్న పగ, ప్రతీకారంతోనే రేవంత్ రెడ్డి కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ ను తిడితే ముఖ్యమంత్రి ఆనందపడొచ్చు కానీ, నీళ్లు లేక రైతుల గుండెలు ఆగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ను తిట్టడం మానేసి వెంటనే మోటార్లు వేసి నీళ్లు ఇవ్వాలని హితవు పలికారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీళ్లను ఒడిసిపట్టకుండా దిగువకు వదిలేస్తుంటే, పక్క రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పట్టిసీమ మోటార్లు ఆన్ చేసి వాడుకుంటున్నారని హరీశ్ రావు గుర్తుచేశారు. 70 టీఎంసీల నీళ్లను వృథాగా ఆంధ్రాకు వదిలేశారని, అదే నీటిని ఎత్తిపోస్తే ఈపాటికి రంగనాయక సాగర్ నిండుగా ఉండేదని వివరించారు. నీళ్లు లేక రంగనాయక సాగర్ లో రాళ్లు, చెట్లు కనిపిస్తూ చిన్నబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ లను నింపాలని, లేదంటే అన్ని మండలాల రైతులు తిరగబడి కాంగ్రెస్ ప్రభుత్వం వారి కోపంలో మాడి మసైపోవడం ఖాయమని హెచ్చరించారు.

# 21న హాకీంపేటలో సీఎం రేవంత్ పర్యటన

**పారిశ్రామిక జోన్ పనులపై ప్రత్యేక సమీక్ష**

**క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు**



కొడంగల్, జూలై 19: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 21న తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ లో పర్యటించనున్నారు. దుద్యాల మండలం హాకీంపేటలో సీఎం పర్యటన ఖరారు కావడంతో స్థానిక అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ పర్యటనకు సంబంధించి ఆదివారం ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి డీఈ సురేందర్, దుద్యాల తహసీల్దార్ తో పాటు కొడంగల్ సీఐ, ఎస్ఐ తదితర అధికారులు ముందస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాలు, హెలిప్యాడ్ ఏర్పాటు, సమీక్షా సమావేశం నిర్వహించే ప్రాంగణాలను వారు నిశితంగా పరిశీలించి సిబ్బందికి తగిన దిశానిర్దేశం చేశారు.

**అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా**

హాకీంపేట పరిధిలో ప్రస్తుతం కొనసాగుతున్న పలు కీలక అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. అనంతరం జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో అక్కడే ఆయన ఒక సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. హాకీంపేట, లగచర్ల, పోలేపల్లి గ్రామాల్లో ప్రతిపాదించిన పారిశ్రామిక జోన్ పనులు, దానికి సంబంధించిన భూసేకరణ పురోగతిపై ఆయన ప్రత్యేక దృష్టి సారించనున్నారు. స్థానికంగా మౌలిక వసతుల కల్పన, నియోజకవర్గానికి కొత్తగా మంజూరైన రహదారులు, పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేయనున్నారు.

దుద్యాల మండలంలో ప్రజా సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు ఏ విధంగా అందుతున్నాయనే విషయమై ముఖ్యమంత్రి ఆరా తీయనున్నారు. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పోలీసు శాఖ పటిష్టమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టింది. మరోవైపు తమ నేత రాకను పురస్కరించుకుని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ పర్యటనను అత్యంత విజయవంతం చేసేందుకు స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు.



# రైతులకే తొలి ప్రాధాన్యత

**నాణ్యమైన విద్యుత్ సరఫరానే ప్రభుత్వ లక్ష్యం**

**ఇల్లెందు పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

ఇల్లెందు, జూలై 19: రాష్ట్రంలో రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఇల్లెందు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కామేపల్లి మండలం మద్దులపల్లి, ఇల్లెందు మండలం రొంపేడు, టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు వద్ద 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని, ప్రస్తుతం డిమాండ్ 16 వేల మెగావాట్లకు చేరిందని ఆయన వివరించారు. డిమాండ్ పెరిగినా వ్యవసాయ, గృహ, పారిశ్రామిక రంగాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించేందుకు డివిజన్ల వారీగా 160 ప్రత్యేక వాహనాలను అందుబాటులోకి తెచ్చామని, ఏవైనా సమస్యలు ఉంటే 1912 నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు ఉన్న ఏజెన్సీ ప్రాంత గిరిజన పోడు సాగుదారుల కోసం ప్రత్యేకంగా ఇందిరా సౌర గిరి జల వికాసం అనే కొత్త పథకాన్ని అమలు చేయనున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. గిరిజన ఉప ప్రణాళిక నిధులతో అమలు చేసే ఈ పథకం కింద బోర్ బావులు, పంపుసెట్లు, వ్యవసాయ పరికరాలను అందజేస్తామని ఆయన తెలిపారు. దీనివల్ల గిరిజన రైతుల ఆత్మగౌరవంతో పాటు వారి ఆదాయం కూడా పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సింధూ నయా హిస్టరీ

**ఫైనల్లో జపాన్ స్టార్ ప్లేయర్ ..**

**యమగుచిపై వరుస గేముల్లో విజయం**

టోక్యో, జులై 19: భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ కైవసం చేసుకుని అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో ఆతిథ్య జపాన్‌కు చెందిన ప్రపంచ స్టార్ ప్లేయర్ అకానే యమగుచిపై సింధు వరుస గేముల్లో ఘన విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచే అద్భుతమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించిన సింధు.. 21-17, 21-17 తేడాతో యమగుచిని మట్టికరిపించింది. ప్రతి గేము చివరి వరకు ఇరు ఆటగాళ్ల మధ్య హోరాహోరీగా సాగినప్పటికీ, ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా కేవలం 50 నిమిషాల్లోనే సింధు మ్యాచ్‌ను ముగించి టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఈ కీలక ఫైనల్ మ్యాచ్‌కు ముందు యమగుచిపై సింధుకు ఈ ఏడాది పెద్దగా సానుకూల రికార్డేమీ లేదు. 2026లో ఈ ఫైనల్‌కు ముందు ఇరు దేశాల ఆటగాళ్లు మూడుసార్లు ముఖాముఖి తలపడగా, అందులో రెండుసార్లు యమగుచినే విజయం సాధించింది. థాయ్‌లాండ్ ఓపెన్ క్వార్టర్స్‌తో పాటు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ ఈ జపాన్ క్రీడాకారిణిదే పైచేయి కాగా, కేవలం మలేషియా ఓపెన్‌లో మాత్రమే యమగుచి మధ్యలోనే రిటైర్డ్ హర్ట్‌గా వెళ్లడంతో సింధుకు విజయం దక్కింది. ఈ ప్రతికూల గణాంకాల వల్ల ఫైనల్లో సింధుపై కాస్త ఒత్తిడి ఉన్నప్పటికీ, మైదానంలో ఆమె ఎక్కడా ఆ ఒత్తిడిని కనబరచలేదు.

# నేడే పార్లమెంట్ మార్చ్

**మొదటి పేజీ తరువాయి**

కోసం కాక్రోచ్ జనతా పార్టీ నేడు చేపట్టదలచిన ఈ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని తన మద్దతుదారులను కోరారు. తెల్లకాగితంపై ఆయన స్వయంగా రాసిన ఈ సందేశాన్ని భార్య గీతాంజలి ఆయన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే, ప్రస్తుతం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతున్నందున భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు ఈ పార్లమెంట్ మార్చ్‌కు అనుమతి నిరాకరించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే, దీర్ఘకాలం పాటు ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తంలో చిన్నపాటి సమస్యలు తలెత్తినప్పటికీ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని, నిపుణులైన వైద్యుల బృందం ఆయన్ను నిశితంగా పరిశీలిస్తోందని ఆస్పత్రి యాజమాన్యం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకే అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఆయన్ను దీక్షా స్థలి నుంచి తరలించామని పోలీసులు పేర్కొన్నారు.

వేగుచుక్క

# ఆగస్టు 2 న “ఊర పండుగ”.

## అందరి సహకారంతో ఘనంగా నిర్వహిద్దాం.

### సర్వ సమాజ్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:



నగరం మొత్తం ఏకమై నిర్వహించే అతిపెద్ద "ఊర పండుగ"ను ఆగస్టు 2న నగర ప్రజలందరి సహకారంతో వైభవోపేతంగా నిర్వహిద్దాం అని సర్వసమాజ్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ తెలిపారు. ఊర పండగ నేపథ్యంలో సన్నాహక సమావేశాన్ని ఆదివారం సిర్నాపల్లి గడిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 2 న నిర్వహించే ఊర పండగ కోసం ఏర్పాట్లను కూడా ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఊర పండుగలో భాగంగా జులై 30న బండారు పోస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా నగరంలోని అన్ని సంఘాలను కలుపుకొని అత్యంత వైభవంగా ఊర పండుగ ను నిర్వహిస్తామని ఆయన అన్నారు.

**దేవాలయాల పరిరక్షణ కోసం కమిటీలు, దేవుడి ఆస్తుల రక్షణ కోసం ఉద్యమం**

నగరంలో రోజురోజుకీ పెరుగుతున్న భూకబ్జాలు, ముఖ్యంగా దేవాలయాల స్థలాలను దోచుకుంటున్న వారి పట్ల నిరసన వ్యక్తం చేస్తూ దేవాలయాలు భూములను పరిరక్షించాలని ఈ సమావేశంలో తీర్మానం చేయడం జరిగింది, దేవాలయాల పరిరక్షణ కోసం సర్వ సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలు వేయాలని కూడా నిర్ణయించడం జరిగినట్లు ఎండల లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సమావేశంలో సర్వ సమాజ కమిటీ కన్వీనర్ రామర్తి గంగాధర్, కోకన్వీనర్ ఆదే ప్రవీణ్, అంతి రెడ్డి సుదన్, తొండూరు అశోక్, బంటు బలరాం, భక్త వత్సలం, సత్యపాల్ మరియు అన్ని కుల సంఘాలు కమిటీల సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# అధ్యక్షుడి చేతులు కట్టేస్తే ఎలా?

**బండి, ఈటల కలిస్తే అధికారం వస్తుందా?**

**జీహెచ్ఎంసీలో ఒక మేయర్ అయినా గెలుస్తారా**

**వ్యక్తి కేంద్రంగా నిర్ణయాలు కాకుండా సమష్టిగా జరగాలి**

**ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు**



హైదరాబాద్, జూలై 19: తెలంగాణ బీజేపీలో ఇద్దరు అగ్రనేతలు కలిస్తే పార్టీ అధికారంలోకి వచ్చేస్తుందా అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సొంత పార్టీ అధిష్ఠానాన్ని సూటిగా ప్రశ్నించారు. ఇటీవల రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి సమక్షంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సమన్వయం కుదిరిన నేపథ్యంలో ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ ఇద్దరు నేతలు కలిసి పనిచేయడం మంచి పరిణామమే అయినా, అంతమాత్రాన రాష్ట్రంలో అధికారం దక్కుతుందనుకోవడం సరికాదన్నారు. పార్టీ కోసం ఏళ్లుగా కష్టపడుతున్న సీనియర్ నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తల పరిస్థితి ఏమిటో నాయకత్వం ఆలోచించాలని ఆయన హితవు పలికారు. కనీసం సగం స్థానాలు గెలవండి

త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎన్నికలపైనా రాజాసింగ్ తనదైన శైలిలో స్పందించారు. రాబోయే ఎన్నికల్లో మూడు కార్పొరేషన్లలో మేయర్ పదవులు గెలుస్తామని నేతలు గొప్పలు చెబుతున్నారని, ముందుగా కనీసం ఒక్క కార్పొరేషన్లో అయినా సగం కార్పొరేటర్ స్థానాలు గెలిచి చూపించాలని ఆయన సవాల్ విసిరారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలం ఎంతుందో వాస్తవంగా అంచనా వేసుకోవాలని, ఇలాంటి అతివిశ్వాస ప్రకటనల వల్ల కిందిస్థాయి కార్యకర్తల్లో తీవ్ర అయోమయం నెలకొంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బూత్ స్థాయి కార్యకర్తలను బలోపేతం చేయకుండా విజయాలు సాధ్యం కావని ఆయన కుండబద్దలు కొట్టారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పరిస్థితిపైనా రాజాసింగ్ సానుభూతి వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడి చేతులు కట్టేసి పనిచేయమంటే ఆయన మాత్రం ఎలా చేయగలరని ప్రశ్నించారు. పార్టీలో కొద్దిమంది నేతల వ్యక్తిగత ఈగోలు, అంతర్గత విభేదాలు సంస్థాగతంగా తీవ్ర నష్టం చేస్తున్నాయని, ఈ పరిణామాలను వెంటనే ఢిల్లీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. పార్టీలో ఏ నిర్ణయమైనా ఒక్క వ్యక్తి చుట్టూ తిరగడం మానుకుని, మొత్తం కేడర్ ను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటేనే పార్టీకి భవిష్యత్తు ఉంటుందని రాజాసింగ్ స్పష్టం చేశారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక “బోనం”..

## - పలు సంఘాల బోనాల పండుగలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్.










వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:


తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ బోనాలు అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని కోటగల్లిలో గల కట్ట మైసమ్మ ఆలయం, నాందేవ్ వాడ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బోనాల పండుగలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆషాఢ మాసం తెలంగాణకు ప్రత్యేక మాసం అన్నారు. గ్రామ దేవతలకు పూజిస్తూ.. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పశువులు ఆరోగ్యంగా ఉండాలని కొలిచే పండగ అన్నారు. బోనాలు కేవలం పండుగ మాత్రమే కాదని, ఇది మన పూర్వీకుల సంప్రదాయాన్ని.. గ్రామదేవతల పట్ల ఉన్న విశ్వాసాన్ని తరతరాలకు అందించే ఆధ్యాత్మిక వేడుక అన్నారు. బోనం అంటే అమ్మవారికి సమర్పించే నైవేద్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలు పాలు, బెల్లంతో వండిన అన్నాన్ని.. కొత్త కుండలో పెట్టి, వేపాకులు, పసుపు, కుంకుమలతో అలంకరించి తలపై మోసుకుంటూ అమ్మవారికి సమర్పిస్తారన్నారు. పోతురాజుల నృత్యాలు, ఘటం ఊరేగింపులు, రంగం వంటి సంప్రదాయాలు పండుగకు మరింత వైభవాన్ని తీసుకువస్తాయన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతకాయల రాజేందర్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, కోటగల్లి మైసమ్మ ఆలయ ప్రతినిధులు దేవేందర్, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ‘అయోధ్య ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలి’



**అయోధ్య:** రామమందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీకి సంయుక్తంగా లేఖ రాశారు. శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై స్వతంత్ర, సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. నగదు, బంగారం, వెండితో సహా భక్తులు సమర్పించిన అన్ని కానుకల నిర్వహణను పరిశీలించాలని, విచారణ నివేదికతో పాటు ట్రస్ట్ ఖాతాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. కాంగ్రెస్ నేతలు ఆదివారం విడుదల చేసిన లేఖలో, రామమందిరానికి విశ్వాసంతో విరాళాలు సమర్పించిన లక్షలాది మంది భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసే విధంగా ఈ ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. భక్తుల కష్టార్జిత సంపాదనతో ఇచ్చిన కానుకలను ఎలా వినియోగించారో తెలుసుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని గుర్తు చేశారు.'ప్రధాని మౌనం సమంజసం కాదు'ఈ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటివరకు స్పందించకపోవడాన్ని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. ఇంత తీవ్రమైన ఆరోపణలు వెలుగులోకి వచ్చినప్పుడు మౌనం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. జవాబుదారీతనం నిర్ధారించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని లేఖలో పేర్కొన్నారు. అలాగే శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆర్థిక లావాదేవీలపై తక్షణమే స్వతంత్ర విచారణ జరిపించాలని రాహుల్?, ఖర్గే కోరారు. నగదు, బంగారం, వెండి రూపంలో వచ్చిన విరాళాల నిర్వహణ తో పాటు ట్రస్ట్ నిర్వహించిన అన్ని ఆర్థిక లావాదేవీలను సమగ్రం గా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.అంతే కాకుండా విచారణ పూర్తైన అనంతరం నివేదికను, ట్రస్ట్‌కు సంబంధించిన ఖాతాలను బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. దీనివల్ల భక్తుల్లో నెలకొన్న అనుమానాలు తొలగుతాయని అభిప్రాయపడ్డారు. రామమందిర విరాళాల దుర్వినియోగానికి సంబంధించిన ఆరోపణలు జూన్ తొలి వారంలో వెలుగులోకి వచ్చినట్లు కాంగ్రెస్ పేర్కొంది. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు, ట్రస్ట్‌కు చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు రాజీనామా చేసినట్లు లేఖలో ప్రస్తావించింది. ట్రస్ట్ ఫిర్యాదు మేరకు జూన్ 25న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని పేర్కొన్నారు.ట్రస్ట్ ఏర్పాటుపై వ్యాఖ్యలుసు ప్రీంకోర్టు ఆదేశాల మేరకు రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఏర్పాటు విషయాన్ని పార్లమెంట్‌లో ప్రధాని ప్రకటించినప్పటికీ, ట్రస్ట్ సభ్యులను కేంద్ర ప్రభుత్వమే నియమించిందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ట్రస్ట్ సభ్యుల్లో పలువురికి ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, అనుబంధ సంస్థలతో సంబంధాలు ఉన్నాయని తమ లేఖలో పేర్కొన్నారు. ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి కూడా ప్రభుత్వానికి సన్నిహితుడేనని ఆరోపించారు. హోదా, పలుకుబడితో సంబంధం లేకుండా తప్పు చేసిన వారందరినీ జవాబుదారీగా నిలబెట్టాలని రాహుల్ గాంధీ, ఖర్గే డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎంత పారదర్శకంగా, ఎంత వేగంగా స్పందిస్తుందనే దానిపైనే ప్రభుత్వం, ట్రస్ట్ విశ్వసనీయత ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. "భారత ప్రజలు గమనిస్తున్నారు" అంటూ తమ లేఖను ముగించారు.సీసీ టీవీలో దాదాపు 70 అనుమానాస్పద సంఘటనలుఇదిలా ఉండగా రామ మందిర విరాళాల దొంగతనం కేసును విచారిస్తు న్న ప్రత్యేక దర్యాప్తు బృందం, ఏప్రిల్? 27 నుంచి జూన్? 5 మధ్య సీసీటీవీలో దాదాపు 70 అనుమానాస్పద సంఘటనలు ప్రాథమికంగా నమోదయ్యాయని, సీసీటీవి ఫుటేజీలో లెక్కింపు సిబ్బంది కట్టల కొద్దీ నగదును దాచి పెడుతూ కనిపించారని పేర్కొంది. ప్రాథమిక నివేదిక లోపాలను ఎత్తి చూపుతూ, ఎంట్రీ, ఎగ్జిట్? ద్వారాల వద్ద తనిఖీ చేయకపోవడం, వ్యక్తిగత వస్తువులపై నియంత్రణ లేకపోవడం, పలు విరాళాల పెట్టెల నుంచి నగదును కలిపి లెక్కించడం వంటి కారణాల వల్ల ఈ నేరం జరగడానికి ఆస్కారం కలిగిందని పేర్కొంది.విచారణకు ముందు కొంతమంది ఉద్యోగుల నుంచి సుమారు రూ.78.94 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. 2026 జూన్? 4న కౌటింగ్? రూమ్?కు అనుబంధంగా ఉన్న బాత్రూమ్ నుంచి అదనంగా రూ.2.25 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కనిపించకుండా పోయిన వెండి ఇటుకలు లేదా ఇతర విలువైన కానుకల గురించి సోషల్? మీడియాలో వస్తున్న వాదనలను సమర్థించేందుకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లభించలేదని కూడా ఆ నివేదికలో పేర్కొన్నారు.

# అఖిలపక్ష భేటీలో డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు లభించిందన్న వార్తలు బూటకం



**ఢిల్లీ, జులై 19:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో (ఆదివారం) కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఆల్ పార్టీ మీటింగ్ రాజకీయ ఉత్కంఠకు, వివాదాలకు దారితీసింది. ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు అఖిలపక్ష సమావేశంలో మద్దతు లభించిందంటూ వస్తున్న వార్తలను కాంగ్రెస్ సీనియర్ నేత, పార్టీ కమ్యూనికేషన్ల ఇన్‌ఛార్జ్, జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ తీవ్రంగా ఖండించారు. అవన్నీ 'పూర్తిగా అబద్ధం, ఫేక్ న్యూస్' అని ఆయన కొట్టిపారేశారు.తప్పుడు వార్తలపై జైరాం రమేశ్ ఆగ్రహంఅఖిలపక్ష సమావేశంలో డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు లభించినట్లు కొన్ని టీవీ ఛానెళ్లు ప్రసారం చేస్తున్న వార్తలు కావాలని సృష్టించినవని జైరాం రమేష్ ఆరోపించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ... 'కొన్ని టీవీ ఛానెళ్లు డీలిమిటేషన్ బిల్లుకు అఖిలపక్ష సమావేశంలో మద్దతు లభించిందంటూ వార్తలను ఫ్లాష్ చేస్తున్నాయి. ఇది పూర్తిగా ఫేక్ న్యూస్' అని ఆయన స్పష్టం చేశారు. ఓఅఖిలపక్ష సమావేశంలో విపక్షాల నిరసన.. వాకౌట్! (జులై 20) ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు, ప్రభుత్వ ఎజెండాపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ అఖిలపక్ష సమావేశాన్ని ఇవాళ ఢిల్లీలో ఏర్పాటు చేసింది. అయితే, సమావేశం ప్రారంభంలోనే తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. 'నేషనల్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా' ని ఈ సమావేశానికి ఆహ్వానించడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు నిర్ణయానికి నిరసనగా విపక్షాలన్నీ సమావేశం నుంచి వాకౌట్ చేశాయి. అయితే, కొన్ని నిమిషాల నిరసన అనంతరం విపక్ష నేతలు మళ్లీ చర్చల్లో పాల్గొనేందుకు లోపలికి వచ్చారు.ఈ విషయమై జైరాం రమేశ్ మాట్లాడుతూ... లోక్‌సభ స్పీకర్ వద్ద అనర్హత నిర్ణయం పెండింగ్‌లో ఉన్న 20 మంది తృణమూల్ కాంగ్రెస్ 'రెబల్' ఎంపీలకు ఈ ఒక 'పార్కింగ్ ప్లేస్' లాంటిదని, అలాంటి పార్టీని మోదీ ప్రభుత్వం ఆహ్వానించడాన్ని నిరసిస్తూనే తాము వాకౌట్ చేశామని వివరించారు.కేంద్ర ప్రభుత్వం ఈ పార్లమెంట్ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతుండగా.. పేపర్ లీకేజీలు, నిరుద్యోగం, ఇతర ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్షాలు వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు జరగనున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వాడివేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

**మహేష్ కుమార్ గౌడ్**

**నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్న టీపీసీసీ అధ్యక్షుడు**

**ఆగస్టు 3 వరకు పూర్తిస్థాయిలో పనిచేయాలని సూచన**

హైదరాబాద్, జూలై 19

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అత్యంత కీలకమైందని, అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకుండా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన జూమ్ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించి ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచిం చారు. బూత్ స్థాయిలో జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆగస్టు 3వ తేదీ వరకు నాయకులందరూ ఎస్ఐఆర్ ప్రక్రియపైనే

వేగుచుక్క

# రష్మిక అంకితభావానికి బృందా మాస్టర్ ప్రశంసలు



**స్టార్ కథానాయిక రష్మిక మందన్న అంకితభావం, క్రమశిక్షణే ఆమె విజయానికి ప్రధాన కారణమని ప్రముఖ నృత్య దర్శకురాలు బృందా మాస్టర్ ప్రశంసించారు. ప్రస్తుతం దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న 'మైసా' చిత్రంలోని ఓ పాటకు నృత్య దర్శకత్వం వహిస్తున్న ఆమె, రష్మిక పనితీరును కొనియాడుతూ సామాజిక మాధ్యమాల్లో భావోద్వేగపూరిత సందేశాన్ని పంచుకున్నారు.**

హైదరాబాద్, జులై 18


రిహార్సల్స్ నుంచి చిత్రీకరణ వరకు రష్మిక చూపిన కష్టపడే తత్వం తనను ఎంతగానో ఆకట్టుకుందని బృందా మాస్టర్ తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా సినీ పరిశ్రమలో ఉన్నప్పటికీ ఇంత క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే కథానాయికలు చాలా అరుదుగా కనిపిస్తారని పేర్కొన్నారు. తాను సూచించిన ప్రతి మార్పును చిరునవ్వుతో స్వీకరించి వెంటనే అమలు చేయడం రష్మిక ప్రత్యేకత అని ఆమె ప్రశంసించారు.

శారీరకంగా నొప్పితో ఉన్న సందర్భాల్లో కూడా రష్మిక తన దృష్టిని పనిపై నుంచి మరల్చలేదని బృందా మాస్టర్ వెల్లడించారు. సినిమా కోసం ఆమె చేసిన శ్రమ తెరపై ప్రతి ప్రేక్షకుడికి స్పష్టంగా కనిపిస్తుందని, ఈ పాత్ర కోసం రష్మిక ఎంతో కష్టపడిందని పేర్కొన్నారు. ఆమె అంకితభావం యువ నటీనటులకు ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

'మైసా' చిత్రంలో రష్మిక గోండ్ గిరిజన యువతి పాత్రలో కనిపించనున్నారు. భావోద్వేగాలతో పాటు శారీరకంగా కూడా సవాల్ విసిరే పాత్రగా దీనిని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది.

ఈ చిత్రంలో ఈశ్వరి రావు, గురు సోమసుందరం, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తుండగా, అంతర్జాతీయ యాక్షన్ నిపుణుడు ఆండీ లాంగ్ పోరాట సన్నివేశాలను రూపొందిస్తున్నారు.

# గర్భంతోనే యాక్షన్ సన్నివేశాల్లో దీపిక



ముంబై, జులై 18

గర్భవతిగా ఉన్నప్పటికీ యాక్షన్ సన్నివేశాల్లో నటించి బాలీవుడ్ కథానాయిక దీపిక పదుకోన్ అరుదైన ఘనత సాధించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారతీయ చలనచిత్ర చరిత్రలో గర్భధారణ సమయంలో షూటింగ్‌లలో పాల్గొన్న నటీమణులు చాలామందే ఉన్నప్పటికీ, గర్భంతోనే కఠినమైన యాక్షన్ సన్నివేశాల్లో నటించడం మాత్రం అత్యంత అరుదైన విషయంగా భావిస్తున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్ కథానాయకుడిగా, దర్శకుడు అట్లీ రూపొం దిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా'లో దీపిక కథానాయికగా నటిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన కీలక యాక్షన్ ఘట్టాలను దర్శకుడు అట్లీ చిత్రీకరించినట్లు సమాచారం. రెండో సంతానానికి జన్మనివ్వబోతున్న దీపిక, గర్భంతోనే ఈ సన్నివేశాల్లో పాల్గొనడం సినీ పరిశ్రమలో ఆసక్తికరంగా మారింది. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, ప్రత్యేక జాగ్రత్తల నడుమ ఈ చిత్రీకరణ నిర్వహించినట్లు తెలుస్తోంది. వృత్తిపట్ల ఆమె చూపిన అంకితభావాన్ని చిత్రబృందం ప్రశంసించినట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. తాను పాటించే ఎనిమిది గంటల పని విధానాన్ని దీపిక పక్కన పెట్టినట్లు సమాచారం. మాతృత్వ విరా మానికి వెళ్లే ముందు 'రాకా'లో తనకు సంబంధించిన చిత్రీకరణను పూర్తిచేయా లని ఆమె నిర్ణయించుకున్నట్లు తెలుస్తో షూటింగ్‌లో పాల్గొంటూనే తన తొలి కుమార్తె దువా సంరక్షణ బాధ్యత లను కూడా సమర్థంగా నిర్వర్తిస్తూ నటిగా, తల్లిగా రెండు పాత్రలను సమానంగా నిర్వహిస్తున్నారని చిత్రబృందం తెలిపినట్లు సమాచారం.

# 'లెనిన్' విజయోత్సవానికి మరో వేడుక?



హైదరాబాద్, జులై 18

అక్కినేని అఖిల్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన 'లెనిన్' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. భావోద్వేగాలు, యాక్షన్ ప్రధానంగా తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుని అఖిల్ సినీ ప్రస్థానంలో మరో విజయవంతమైన చిత్రంగా నిలిచింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని చిత్రబృందం ఇప్పటికే గుంటూరులో నిర్వహించిన విజయోత్సవ సభకు మంచి స్పందన లభించింది. తాజాగా ఈ చిత్ర విజయాన్ని మరింత ఘనంగా జరుపుకునేందుకు మరో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. జులై 20న ఈ కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ వేడుకలో చిత్రబృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొనే అవకాశం ఉందని తెలుస్తోంది.

# రూ.100 కోట్ల క్లబ్‌లోకి 'ధమాల్--4'


ముంబై, జులై 18

బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటించిన హాస్య వినోద చిత్రం 'ధమాల్--4' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, ప్రేక్షకుల ఆదరణతో ఈ చిత్రం వసూళ్ల పరంగా సత్తా చాటుతోంది. రెండో వారంలోనూ అదే జోరును కొనసాగిస్తూ దేశీయంగా రూ.100 కోట్ల నికర వసూళ్ల మైలురాయిని అధిగమించింది. రెండో శుక్రవారం ఈ చిత్రం ఆశాజనక వసూళ్లు నమోదు చేయడం సినీ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా రెండో వారానికి సినిమాల వసూళ్లు తగ్గుముఖం పట్టే పరిస్థితి కనిపిస్తుంటే, 'ధమాల్--4' మాత్రం స్థిరమైన ప్రదర్శనతో ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తోంది. వారాంతంలో వసూళ్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇటీవలి కాలంలో విడుదలైన పలువురు బాలీవుడ్ అగ్ర హీరోల చిత్రాలు ప్రారంభ రోజుల్లోనే జోరు చూపి, ఆ తర్వాత వేగంగా తగ్గిపోయాయి.





# కథల ఎంపికలో కృతి కొత్త నిర్ణయం

ముంబయి, జులై 18



బాలీవుడ్ కథానాయిక కృతి సనన్ తన సినీ ప్రస్థానంలో ఇప్పుడు కొత్త దశలో ఉన్నట్లు తెలిపారు. కెరీర్ ప్రారంభం లో వచ్చిన ప్రతి అవకాశాన్ని స్వీకరించినప్పటికీ, ఇప్పుడు మా త్రం కథ బలంగా ఉ ంటేనే సినిమాలకు అంగీకరిస్తున్నట్లు వెల్లడించారు. సంఖ్య కంటే నాణ్యతకే ప్రాధాన్యం ఇస్తున్నానని, మంచి పాత్రల ద్వారానే ప్రేక్షకుల ముందుకు రావాలని కోరుకుంటు న్నానని ఆమె చెప్పారు. తెలుగులో 'నేనొక్కడినే' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన కృతి సనన్, ఆ తర్వాత హిందీ చిత్రసీమలో అగ్ర కథానాయికగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రారంభ రోజుల్లో అవకాశాలు కోల్పోకూడదనే ఉద్దేశంతో వరుసగా సినిమాలు చేసిన ఆమె, ప్రస్తుతం మాత్రం కథ, పాత్రకు ప్రాధాన్యం ఉన్న చిత్రాలనే ఎంపిక చేసుకుంటున్నట్లు తెలిపారు. ఫలితం గురించి ఆందోళన చెందకుండా తనకు సంతృప్తినిచ్చే కథల్లో నటించడానికే ఆసక్తి చూపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తన కెరీర్ అత్యంత ఆసక్తికరమైన దశలో కొనసాగుతోందని కృతి అన్నారు. ఇప్పటివరకు సాధించిన విజయాలతో ఎంతో సంతోషంగా ఉన్నానని, ఇకపై నటిగా మరింత వైవిధ్యమైన పాత్రలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.



# అవమానాలను అవకాశాలుగా మార్చుకున్నా: భాగ్యశ్రీ

హైదరాబాద్, జులై 18

పాఠశాల రోజుల్లో ఇంగ్లిష్ రాక ఎదుర్కొన్న అవమానాలే తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయని, అదే తన విజయానికి బలమైన పునాది అయిందని నటి భాగ్యశ్రీ బోర్సే తెలిపింది. ఇటీవల ఓ కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె తన చిన్ననాటి అనుభవాలు, చదువులో ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించిన తీరును వివరించింది. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో తన బాల్యం గడిచిందని భాగ్యశ్రీ తెలిపింది. మరాఠీ మాధ్యమ పాఠశాలలో చదువుకున్నా నని, అనంత రం తండ్రి ఉ ద్యోగరీత్యా కుటుంబ మంతా నైజీరియాకు వెళ్లాల్సి వచ్చిందని చెప్పింది. అక్కడ ఇంగ్లిష్ మాధ్యమ పాఠశాలలో చేరిన తర్వాతే అసలు సవాళ్లు మొదలయ్యాయని పేర్కొంది. మరాఠీ, హిందీ తప్ప మరో భాష తెలియకపోవ డంతో పాఠాలు అర్థం చేసుకోవడం కూడా కష్టంగా మారిందని, ఇంగ్లిష్ మాట్లాడలేకపోవడంతో సహ విద్యార్థులు ఎగతాళి చేస్తూ ఆటపట్టించేవారని గుర్తు చేసుకుంది. అలాంటి పరిస్థితుల్లో తాను ఎప్పుడూ నిరుత్సాహపడలేదని భాగ్యశ్రీ చెప్పింది. తనను అవమానించిన ప్రతి మాటను సవాలుగా స్వీకరించి ఇంగ్లిష్‌పై పూర్తిగా దృష్టి పెట్టానని తెలిపింది. ప్రతిరోజూ కొత్త పదాలు నేర్చుకోవడం, పుస్తకాలు చదవడం, ఉపాధ్యాయుల సహాయం తీసుకోవడం ద్వారా కొద్ది కాలంలోనే భాషపై మంచి పట్టు సాధించానని వివరించింది.